


అవే వాహనాలు. అదే పని. తేడా ఏమంటే.. వైసీపీ ప్రభుత్వం పోయి.. కూటమి అధికారంలోకి వచ్చింది. అంతే.. తిరుపతి కార్పొరేషన్‌లో డీజిల్ ఖర్చు నెలకు రూ.20 లక్షలు మిగిలింది. అంటే.. ఏడాదికి రూ.రెండు కోట్లకుపైగా డీజిల్‌లో నొక్కేసినట్లు 'లెక్క' తేలిందన్నది కార్పొరేషన్ వర్గాల మాట. అప్పటి వైసీపీ పెద్దల అండతో, ఓ డీఈ నేతృత్వంలో ఈ డీజిల్ కుంభకోణం సాగినట్లు విమర్శలున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కార్పొరేషన్‌లో డీజిల్ స్కాం

- ఓ డీఈ నేతృత్వంలో ఖజానాకు గండి
- వైసీపీ పెద్దల హస్తం ఉన్నట్టు అనుమానం
- ఇప్పుడు నెలకు రూ.10లక్షల వరకు మిగులు

వైసీపీ హయాంలో ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారనడానికి తిరుపతి నగరపాలక సంస్థలో వెలుగుచూసిన డీజిల్ స్కాం ఒకటి. నగరపాలక సంస్థలో వినియోగిస్తున్న చెత్త ట్రాక్టర్లు 19, ఆటోలు 97, ట్రాలీలు 15, టిప్పర్లు 2, ఎక్స్‌కవేటర్లు (చిన్న, పెద్దవి 4), వాటర్ ట్యాంకర్లు, యూడీఎస్ గల్పర్లతో పాటు కార్పొరేషన్ సొంత కార్లకు డీజిల్, పెట్రోలు నింపాల్సి ఉంటుంది. వీటికి సరాసరి రోజుకు వెయ్యి లీటర్ల కన్నా ఎక్కువ కాదు. అయితే గతంలో రోజుకు సరాసరి 1500 లీటర్లు పట్టినట్టు బిల్లులు పెట్టినట్టు తెలుస్తోంది. కార్పొరేషన్ వాహనాల పేరు మీద ఇతరులూ తమ వాహనాల్లో ఇంధనాన్ని నింపుకునేవారనే విమర్శలున్నాయి. కార్పొరేషన్ వాహనాలకు తిరుపతిలో మూడు పెట్రోల్ బంకులనుంచి డీజిల్ నింపుతారు. డీజిల్‌కు సంబంధించి కార్పొరేషన్ జారీ చేసిన టోకెన్స్, బంక్‌లనుంచి వచ్చే బిల్లులు కూడా టోకెన్ల నెంబర్లతో రావాలి. డీజిల్ బిల్లుపై సూపర్ చెక్ ఉండాలి. డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులతో రెగ్యులర్‌గా పర్యవేక్షణ ఉండాలి. ఇక, కార్పొరేషన్ వాహనాలన్నీ జీపీఎస్ విధానంతో అనుసంధానమయ్యాయి.

ఇలా బయటపడింది : వైసీపీ పెద్దల అండతో గత పాలనలో కార్పొరేషన్‌లో చక్రం తిప్పిన ఇంజినీరింగ్ విభాగంలోని ఓ డీఈ డీజిల్ స్కాంలో ప్రధాన పాత్రధారి అన్న ఆరోపణలున్నాయి. ఏడు నెలల కిందట అవినీతి ఆరోపణలతో ఈయన బదిలీపై వెళ్లారు. దీంతో డీజిల్ వినియోగంపై మూడంచెల పర్యవేక్షణతో కొత్త అధికారులకు కమిషనర్ మౌర్య బాధ్యతలు అప్పగించారు. గతానికి, ఇప్పటికి పోల్చి చూస్తే నెలకు దాదాపు రూ.20లక్షల వరకు డీజిల్ బిల్లు తగ్గిపోవడంతో అధికారులు అవాక్కయ్యారు. ఓ సందర్భంలో అధికారుల సమీక్షలో కమిషనర్ డీజిల్ బిల్లు గురించి ప్రత్యేకంగా చర్చించినట్టు తెలిసింది. దీంతో కేవలం డీజిల్‌లోనే నెలకు రూ.20లక్షల వరకు అప్పట్లో దోపిడీ సాగిందన్న విషయం వెలుగు చూసింది. కాగా, డీజిల్ నొక్కుడులో ఆ ఇంజినీరింగ్ అధికారికి ఎంత నైపుణ్యం ఉందో.. వంపకాల్లోనూ అంతే టాలెంట్ చూపేవాడని కార్పొరేషన్ వర్గాలు అంటుంటాయి.

వాహనం ప్రారంభమైనప్పటి నుంచి వెళ్లిన ప్రదేశాలు, ఎన్ని కిలోమీటర్ల పరిధిలో వాహనం తిరిగిందన్న విషయం పక్కాగా తెలుస్తుంది. వాటిని బట్టి రోజుకు ఎన్ని లీటర్లు అవసరమో ప్రాథమికంగా ఓ అంచనా వేయచ్చు. ఆ విధంగా వేసే గతంలో ఓ కమిషనర్ డీజిల్ బిల్లులను పక్కనపెట్టినట్టు తెలిసింది. అయితే అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిడితో పాటు డీజిల్ బిల్లులు ఇవ్వకపోతే చెత్త వాహనాలు నిలిచిపోతాయనే బ్లాక్ మెయిల్ చేసి మరీ బిల్లులపై సంతకాలు పెట్టించుకునే వారని చెప్పుకుంటున్నారు. ఇలా గతంలో డీజిల్ వినియోగంలో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి.

అక్రమాలకు అవకాశం లేకుండా

గతంలో నగరంలోని ప్రధాన రోడ్లను రాత్రిపూట స్వీపింగ్ వాహనాలతో శుభ్రం చేసేవారు కాదు. ఇప్పుడు చేస్తున్నారు. అదే విధంగా కొత్త వాహనాలను వినియోగిస్తున్నారు. ఇవన్నీ చేస్తున్నా నెలకు సుమారు రూ.45 లక్షల నుంచి రూ50లక్షలు డీజిల్ బిల్లు వస్తోంది. ఇలా మరిన్ని వాహనాలతో డీజిల్ వినియోగం పెరిగినా.. వైసీపీ హయాంతో పోలిస్తే ఇప్పటికీ రూ.పది లక్షల వరకు మిగులే ఉంటోంది. ప్రస్తుతం ఏ వాహనంలో ఎంత డీజిల్ పోస్తున్నారు? అది ఎన్ని కిలోమీటర్ల దూరం తిరిగింది అన్న సమాచారం పక్కాగా ఉండటంతో అక్రమాలకు అవకాశం లేకుండా పోయినట్టుగా తెలుస్తోంది.

విచారించకుండా వదిలేస్తారా?

డీజిల్ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని కార్పొరేషన్ గుర్తించింది. దీనిపై బాహాటంగానే చర్చ జరుగుతోంది. ఎస్‌ఈ, ఎంఈ సంతకాలు లేకుండా కూడా డీజిల్ బిల్లులు జారీ అయ్యాయని చెబుతున్నారు. ఏడాదికి దాదాపు రూ.రెండు కోట్లు లూటీ చేస్తే మౌనం దాల్చడం సరికాదన్న విమర్శలు వస్తున్నాయి. డీజిల్ వినియోగంలో అవకతవకల ఆరోపణలపై పైళ్లను పరిశీలించాల్సిన అవసరం ఉంది. లాగ్‌బుక్‌లు, ఓచర్లు తనిఖీ చేస్తే దీనివెనుక ఎవరున్నారో అసలు బండారం బయటపడుతుంది. కూటమి నాయకులైనా దీనిపై విచారణ జరిపించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

షార్‌తో విడదీయని బంధం


కస్తూరి రంగన్‌కు నివాళులు అర్పిస్తున్న షార్ ఉద్యోగులు

- పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ అభివృద్ధిలో కస్తూరి రంగన్ కీలకపాత్ర
- ఉద్యోగుల ఘన నివాళి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్‌కు షార్‌తో విడదీ యని బంధం ఉంది. బెంగళూరులోని తన నివాసంలో శుక్రవారం కన్నుమూశారు. 1990-94 బెంగళూరులోని శాటిలైట్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేసిన కస్తూరి రంగన్.. 1994 నుంచి 2003 వరకు ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన హయాంలోనే తొలి లూనార్ మిషన్‌కు అడుగులు పడ్డాయి. ఇస్రో చైర్మన్‌గా ఉన్న ఈయన పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్ అభివృద్ధి కీలకపాత్ర పోషించారు. ఈయన హయాంలో షార్ నుంచి మొత్తం 8 ప్రయోగాలు చేపట్టారు. ఇందులో 6 పీఎస్ఎల్వీ, 2 జీఎస్ఎల్వీ ప్రయోగాలు ఉన్నాయి. కొత్తతరం అంతరిక్ష నౌక, ఇండియన్ నేషనల్ శాటిలైట్ అభివృద్ధికి (ఇన్‌శాట్-2), భారతీయ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్స్ ఐఆర్ఎస్-1ఏ, 1బి వంటి కీలక ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. భూపరిశీలనకు సంబంధించిన బాస్కర-1, బాస్కర-2 ఉపగ్రహాలకు ప్రాజెక్టు డైరెక్టర్‌గా కూడా పని చేశారు. కాగా, షార్‌లోని పరిపాలన విభాగ భవనంలో కస్తూరి రంగన్ చిత్రపటం ఏర్పాటు చేసి షార్ కంట్రోలర్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయనకు షార్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.


స్కూల్ ఆవరణలో పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న కస్తూరి రంగన్ (ఫైల్ ఫొటో)

సూళ్లూరుపేట పాఠశాలకు నిధులు

ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్ రాజ్యసభ సభ్యుడిగా సూళ్లూరుపేట అభివృద్ధికి నిధులు కేటాయించారు. శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ మాజీ డైరెక్టర్, పూర్వ విద్యార్థి డాక్టర్ కె.నారాయణ విన్నపం మేరకు సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాదాపు 18 ఏళ్ల కిందట తన ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలను మంజూరు చేశారు. ఆ సందర్భంగా ఉన్నత పాఠశాలకు వచ్చిన కస్తూరి రంగన్‌ను పూర్వ విద్యార్థులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాటి సంఘటనను పూర్వ విద్యార్థులు గుర్తుచేసుకుంటూ ఆయన మృతికి సంతాపం తెలిపారు.

తిరునగరిలో 'కస్తూరి' పరిమళం

- 2022లో ఎస్వీయూ గౌరవ డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి: ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కె.కస్తూరి రంగన్ జ్ఞాపకాలు తిరుపతిలో పదిలంగా ఉన్నాయి. ఇస్రోకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా 2022లో ఎస్వీయూ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ సందర్భంలో ఆయన ఉత్తేజ పూరితంగా స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. అదే దశలో నూతన జాతీయ విద్యా విధానం-2020 చైర్మన్ హోదాలో ఆయన వ్యవహరించారు. అంతరిక్ష పరిశోధన రంగంలో కస్తూరి రంగన్‌లేని లోటు తీర్చలేనిదని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సంతాపం తెలిపారు. మన దేశం గొప్ప శాస్త్రవేత్తను కోల్పోయిందని పేర్కొన్నారు.



ఎస్వీయూలో 2022లో ప్రసంగిస్తున్న డాక్టర్ కస్తూరి రంగన్ (ఫైల్ ఫొటో)

ఏటీఎం సాగు


ఏటీఎం అంటే.. ఎనీటైం మనీ. మన అకౌంట్‌లో ఉన్న డబ్బును డెబిట్ కార్డుతో ఎప్పుడైనా తీసుకోవచ్చు. మరి సేద్యంలో ఏటీఎం సాగు అంటే.. తక్కువ విస్తీర్ణంలో అంతర పంటలతో ప్రతిరోజూ ఎంతో కొంత డబ్బు కళ్లజూడటం.

ఆ సాగు వివరాలేంటో 6లో చూద్దాం

చిట్టేచర్లలో ఏనుగులు

బాకరాపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీ దక్కావాండ్లపల్లె, భోగేవాండ్లపల్లె గ్రామాల సమీపంలోని మామిడి తోటల్లో రెండు ఏనుగులు సంచరిస్తున్నాయి. భోగేవాండ్లపల్లె వద్ద ఏనుగులు వరి పైరును ధ్వంసం చేశాయి. వీటిని సమీప అడవుల్లోకి మళ్లించేందుకు అటవీ సిబ్బంది ప్రయత్నాలు చేపట్టారు. ఈక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా బయట తిరగరాదని అటవీ శాఖాధికారులు సూచించారు.


భోగేవాండ్లపల్లె సమీపంలోని మామిడి తోటలో ఏనుగులు

తిరుపతి పూర్వ డీసీ సస్పెన్షన్ కొనసాగింపు

- శాఖాపరమైన విచారణకు ఆదేశం

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పూర్వ డిప్యూటీ కమిషనర్ (డీసీ) పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవాలు తేల్చేందుకు రెగ్యులర్ శాఖాపరమైన విచారణ జరపాలని నిర్ణయించింది. దానికనుగుణంగా అనంతపురం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ పి.విశ్వనాథను విచారణాధికారిగా నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో దీనికి సంబంధించిన పూర్వాపరాలను పరిశీలిస్తే.. తిరుపతి కార్పొరేషన్‌లో గత వైసీపీ ప్రభుత్వంలో పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. 2021లో తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు జరిగిన సందర్భంలో ఆయన తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్వోగా వ్యవహరించారు. అయితే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయకుండానే తనకు తానుగా ఆయన ఈఆర్వోగా వ్యవహరించినట్టు ఆ తర్వాత తేలింది. అనధికారికంగా ఈఆర్వోగా వ్యవహరించిన సమయంలో ఎపిక్ కార్డులు అక్రమంగా డౌన్‌లోడ్ చేశారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ రెండు ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరి 9న ఆయన్ను సస్పెండ్ చేసింది. అనంతరం గతేడాది సెప్టెంబరు 29న చంద్రమౌళీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌ను సమీక్షించిన రివ్యూ కమిటీ సస్పెన్షన్ ఎత్తివేసేందుకు నిరాకరించింది. దాంతో ఆయన సస్పెన్షన్ ఇప్పటి దాకా కొనసాగింది. తాజాగా గతనెల 13వ తేదీన రెండోసారి రివ్యూ కమిటీ సమావేశమై సస్పెన్షన్‌పై సమీక్షించింది. ఆ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో సస్పెండు కావడం, అలాగే ఆయనపై వచ్చిన ఆరోపణలు ఎన్నికల నిబంధనల పరంగా తీవ్రమైనవి కావడంతో సస్పెన్షన్‌ను యథాప్రకారం కొనసాగించాలని సిఫారసు చేసింది. దీంతో ఆయన సస్పెన్షన్‌ను తదుపరి ఉత్తర్వుల వరకూ కొనసాగించాలని రాష్ట్ర మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విచారణాధికారిగా అనంతపురం ఆర్డీ

తిరుపతి పూర్వ డీసీ పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ వచ్చిన తీవ్రస్థాయి ఆరోపణలపై విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనంతపురం మున్సిపల్ ఆర్డీ పి.విశ్వనాథను విచారణాధికారిగానూ,కార్పొరేషన్ ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ అమరయ్యను ప్రెజెంటింగ్ అధికారిగానూ నియమించింది.మూడు నెలల్లో విచారణ ముగించి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం విచారణాధికారిని ఆదేశించింది.ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.


మైన్స్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఇసుక కొరత లేకుండా చూడండి

- స్టాక్‌యార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహ నిర్మాణ దారులకు ఇసుక కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉచిత ఇసుక పాలసీపై అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున.. పక్క జిల్లాల నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి, శ్రీకాళహస్తిలో ఇసుక స్టాక్‌యార్డు ఏర్పాటు చేసేందుకు ప్రైవేటు ఏజెన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నామమాత్రపు ధరకే వీరు ఇసుక విక్రయించాల్సి ఉంటుందన్నారు. మే 1 సాయంత్రంలోపు ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2న జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో ఏజెన్సీలకు స్టాక్‌యార్డులు కేటాయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 91006 88839 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే నాని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన జరిగిన మండల మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. బోర్లు, మరమ్మతులు, పైప్‌లైన్ పనులు నెలాఖరులోపు పూర్తిచేయాలన్నారు. అలాగే అవసరమైన చోట నెలాఖరులోగా శ్మశాన స్థలాలను గుర్తించాలన్నారు. ఆక్రమిత ప్రభుత్వ భూముల స్వాధీనానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రూ.85కోట్లతో 890 అభివృద్ధి పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ పద్మజరెడ్డి, ఎంపీడీవో అరుణ, తహసీల్దార్ సంతోష్ సాయి, సర్పంచలు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై పద్మావతిదేవి అభయం



తిరుచానూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పద్మావతి వారికి శుక్రవారం వేడుకగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. ఉదయం అమ్మవారి మూలవర్లకు స్నేతవర్ణంగా అభిషేకం చేశారు. అనంతరం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ జరిగింది. మధ్యాహ్నం వేడుకగా తిరుమంజనం నిర్వహించారు. రాత్రి సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాష్కర్‌నాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి పీఎండీఎస్ కీలకం


ప్యాకింగ్ అయిన విత్తనాల కిట్లు

రామచంద్రాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగులో ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) పద్ధతి కీలకమని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు షణ్ముగం అన్నారు. కుప్పంబాదూరు పంచాయతీ పడ్డికాలువలో శుక్రవారం మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది 30 రకాల విత్తనాలతో 300(10కేజీల వంతున) కిట్లను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయ విధానాలను వివరించారు. రామచంద్రాపురం మండలం ప్రకృతి వ్యవసాయానికి మోడల్ ఉన్న నేపథ్యంలో ప్రతి రైతుకు పీఎండీఎస్ పద్ధతి ప్రయోజనాలను తెలిపేలా ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పనిచేయాలన్నారు. అనంతరం కిట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాంకర్ రవిచంద్రప్రసాద్,అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత అక్రమాలపై చర్యలు తీసుకోండి


తహసీల్దార్‌కి వినతిపత్రాన్ని అందజేస్తున్న మురళి

చంద్రగిరి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపంలోని జగనన్న కాలనీ నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు మురళి తహసీల్దార్ శివరామసుబ్బయ్యకు ఫిర్యాదుచేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పనికి రాని భూములను వైసీపీ నాయకుడు చంద్రమౌళిరెడ్డి నాడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని, డీ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్‌కు మార్చి కోట్లాది రూపాయల మేర లబ్ధి పొందారని ఆరోపించారు. ఈ మార్పిడికి రైతులను నుంచి భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పడ్డారన్నారు. సుమారు 50 ఇంటి స్థలాలు బినామీ పేర్లతో ఉంచుకున్నారన్నారు. ఈ వ్యవహారంపై విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బస్ షెల్టర్ ఆక్రమణపై తహసీల్దార్‌కి ఫిర్యాదు


ఆక్రమణకు గురైన బస్‌షెల్టర్

చంద్రగిరి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-నాయుడుపేట పాత జాతీయ రహదారిలో బోడెంబాయి వద్ద గతంలో ఎంపీ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్‌తో పాటు దారిని కూడా ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని గ్రామస్థులు శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఎం.కొంగరవారిపల్లెకు చెందిన వడ్లమూడి బాబునాయుడు తన పొలం వద్ద జాతీయ రహదారికి అనుకొని ఉన్న ప్రభుత్వ బస్ షెల్టర్‌తో పాటు అక్కగార్ల దేవతకు వెళ్ళే దారినీ ఆక్రమించుకున్నారన్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నాడన్నారు. విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్‌కు వీడ్కోలు


హేమంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌గా విధులు నిర్వహించిన ట్రైనీ ఐపీఎస్ అధికారి బొడ్డు హేమంత్‌ను శుక్రవారం పోలీసు సిబ్బంది సన్మానించారు. ఆయన ఆర్‌సీపురంలో రెండు నెలల పాటు సమర్థవంతంగా విధులు నిర్వహించారు. శుక్రవారం విధుల నుంచి రిలీవ్ అవుతున్న సందర్భంగా పోలీసు సిబ్బంది వందన సమర్పణ చేశారు. సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయనను పోలీసులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎస్ఐ రవీంద్రనాథ్, ఏఎస్ఐ శేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులునాయక్

తిరుపతి రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వేను భూమి యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామాంజులునాయక్ కోరారు. వేదాంతపురం గ్రామ పంచాయతీలో శుక్రవారం రీసర్వే ప్రాజెక్ట్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామానికి హద్దులు గుర్తించి ప్రభుత్వ, ప్రైవేట్ భూముల సర్వే ప్రక్రియని చేపడతామన్నారు. ఇన్‌చార్జి సర్పంచ్ చెరుకుల జనార్దన్‌యాదవ్, డివిజన్ డీఐఓ ఎస్ చిట్టిబాబు, మండల సర్వేయర్ హేమకుమార్, రీసర్వే డీటీ మోహన్, వీఆర్వో బాలకృష్ణ, సంతోషకుమారి కార్యదర్శి మునీశ్వరి, గ్రామస్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తమామలు, ఆడపడుచు, ఆమె భర్త వేధింపులతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో భర్త, అత్తమామలను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. మండలంలోని అరిగిల కండ్రిగ అరుంధతివాడకు చెందిన పల్లవి(19), తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం అరుంధతవాడకు చెందిన మాతయ్య అలియాస్ చరణ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొద్ది రోజుల తరువాత వివాహేతర సంబంధం పెట్టుకున్నావంటూ పల్లవిని భర్త చరణ్, మామ కృష్ణయ్య, అత్త నాగరాజమ్మ, ఆడపడుచు గౌరి, ఆమె భర్త కుమార్ వేధించారు. ఈ వేధింపులు తాళలేక మార్చి 27న పల్లవి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై ఎస్ఐ.. చరణ్, దర్యాప్తు చేపట్టిన కృష్ణయ్య, నాగరాజమ్మను శుక్రవారం చల్లమాంబపురం బస్టాండ్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

30వ తేదీ లోపు ఈకేవైసీ చేసుకోండి

రామచంద్రాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) మండలంలోని రేషన్‌కార్డుదారులు ఈ నెల 30వ తేదీ లోపు ఈకేవైసీ చేసుకోవాలని డీటీ అన్వర్ బాషా కోరారు. శుక్రవారం ఆయన తహసీల్దారు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మండలంలో 11 రెవెన్యూ గ్రామాల్లోని చౌక దుకాణాల్లో 1,533 రేషన్‌కార్డుల్లోని సభ్యులు ఈ కేవైసీ చేసుకోవాలన్నారు. చేసుకోకపోతే నిత్యావసర సరుకుల పంపిణీ ఆగిపోతుందన్నారు. గ్రామ సచివాలయాల్లో, రేషన్ డీలర్ల వద్ద ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

భర్త దాడి :భార్యకు తీవ్ర గాయాలు

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తాగి వచ్చి విచక్షణారహితంగా భర్త దాడి చేయడంతో భార్య తీవ్రంగా గాయాలపాలైన వైనమిది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. నెరబైలు పంచాయతీ ఎలిమెంటరీ స్కూల్ సమీపాన నివాసముండే వెంకటేశు,మానసలకు తొమ్మిదేళ్ల క్రితం పెళ్లయింది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. వెంకటేశు నిత్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడుతుంటాడు. ఈ క్రమమంలో గురువారం రాత్రి తాగి విక్షచణ కోల్పోయాడు. నిద్రిస్తున్న భార్య మానసపై దాడి చేశాడు. వెన్నుపూస దెబ్బతినడంతో ఆమె ఆసుపత్రిలో చేరింది. దాడి జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

టీటీడీ ట్రాన్స్‌పోర్టు డీఐ బాధ్యతల స్వీకారం


వెంకటాద్రి నాయుడు

తిరుమల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): టీటీడీ తిరుమల ట్రాన్స్‌పోర్టు డీఐగా వెంకటాద్రి నాయుడు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో డీఐగా ఉన్న సుబ్రహ్మణ్యం తిరుపతికి బదిలీ కాగా, ఆస్థానంలో వెంకటాద్రి నాయుడును టీటీడీ నియమించింది. ఈక్రమంలో వెంకటాద్రి నాయుడు తిరుమలలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు రూ.5.33 లక్షల సాయం


చిన్నారి కుటుంబ సభ్యులకు చెక్కుఅందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు రమేష్, శంకరయ్య

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామరాయి పంచాయతీ కొల్లపట్టు గ్రామానికి చెందిన మాగర్ల శాన్వి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5.33 లక్షల చెక్కును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టుక నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి వెంటనే ఆర్థిక సాయం అందజేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రమేష్, ఏజీ కిషోర్, కొక్కు. శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

దొరవారిసత్రం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దొరవారి సత్రం పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు.. ఈ నెల 22వ తేదీన మండలంలోని కట్టువపల్లి గ్రామానికి చెందిన అందలమాల శివ ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

ఓజిలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దవరియకు చెందిన గిరిజన మహిళ నాగభూషణమ్మ(57) అప్పుల బాధతో గుళి కలు తిని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు జగన్నాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

చెత్త సంపద తయారీ కేంద్రాలు కళకళ



పెరుమాళ్లపల్లెలో పచ్చని మొక్కల మధ్య వ్యర్థాల తొట్టెలు- వివిధ రకాల మొక్కలు

తిరుపతి రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపల్లి, అవిలాల పంచాయతీలోని చెత్త సంపద తయారీ కేంద్రాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. పెరుమాళ్లపల్లిలో 1.25ఎకరాల విస్తీర్ణంలోని సంపద తయారీ కేంద్రం వివిధ రకాల పూల, పండ్ల మొక్కలతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. ఈ కేంద్ర ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో జామ, అరటి, బొప్పాయి, మునగ, కానుగ, కొబ్బరి మొక్కలను పెంచుతున్నారు. దుంపలు, ఆకు కూరలు పండిస్తున్నారు. పశుపక్షాదుల దహన సంస్కారానికి గుంతను కూడా ఏర్పాటుచేశారు. ఇప్పటికే ఈ కేంద్రం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా గుర్తింపు పొందింది. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. అలాగే అవిలాల కేంద్రమూ పచ్చదనంతో అలరారుతోంది. ఇక్కడ తడిచెత్త నుంచి నెలకు 250కేజీల చొప్పున ఎరువును తయారుచేస్తున్నారు. పొడిచెత్త నుంచి అట్టపెట్టెలు, వాటర్, బీరుబాటిళ్ల వంటివాటిని వేరుచేసి విక్రయిస్తున్నారు. చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు 2014లో నిర్మితమై వైసీపీ హయాంలో నిరుపయోగంగా మారిన 25కేంద్రాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.



వర్మీకంపోస్ట్ విక్రయస్టాల్

ఏనుగుల సంచారంతో రైతులు భయాందోళన

● అప్రమత్తం చేస్తున్న అటవీశాఖ అధికారులు

చంద్రగిరి,ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మళ్లీ మండలంలో ఏనుగులు గుబులు రేకెత్తిస్తున్నాయి. తాజాగా కల్‌రోడ్డుపల్లె పంచాయతీ పరిధిలోని ఆముదాల కోన ఎస్టీ కాలనీ సమీపంలో సంచరించి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. వీటి ఉనికితో అటవీశాఖ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఎఫ్ఆర్వో మాధవీలత శుక్రవారం ఉదయం ఆముదాల కోన చెరువు వద్దకు చేరుకుని పరిశీలించారు. గురువారం రాత్రి సుమారు ఆరు ఏనుగులు ఇక్కడి చెరువుకు వచ్చి నీళ్లు తాగి పనపాకం రైల్వే స్టేషన్ సమీపంలోని అటవీ ప్రాంతం మీదుగా వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. అదృష్టవశాత్తూ ఇవి పంటలను ధ్వంసం చేయలేదు. శుక్రవారం సాయంత్రం ఆముదాలకోనం, కల్‌రోడ్డుపల్లె, దానామూర్తిపల్లె, పనపాకం అటవీ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్న నేపథ్యంలో అర్ధరాత్రి వేళలో రైతులు పొలాల వద్దకు వెళ్లరాదని అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు.


ఏనుగుల గుంపు సంచరించిన ఆనవాళ్లు

తిరుపతి క్రైం రిటైర్డు డీఎస్పీపై విచారణకు విచారణాధికారి మార్పు

● మంగళగిరి పీటీవో డీఐజీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి క్రైం విశ్రాంత డీఎస్పీ రామమోహన్‌పై విచారణకు సంబంధించి విచారణాధికారిని ప్రభుత్వం మార్చింది. గుంటూరు రేంజ్ డీఐజీ స్థానంలో మంగళగిరి పోలీసు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ డీఐజీని నియమించింది. రెండేళ్ల కిందట రామమోహన్ తిరుపతి క్రైం డీఎస్పీగా పనిచేసినప్పుడు పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన పలు ఫిర్యాదులపై విచారించి నివేదిక ఇవ్వాలని అప్పటి క్రైం అదనపు ఎస్పీ సుప్రజ ఆదేశించారు. ఇందులో భూవివాదాలు, ఆర్థిక లావాదేవీలు తదితర కీలకమైన కేసుల విచారణలో అప్పటి డీఎస్పీ రామమోహన్ అడ్డదారులు తొక్కి నిందితులకు కొమ్ముకాశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై కొందరు బాధితులు నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఆయనపై విచారించి నివేదిక ఇవ్వాలని గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమవర్మను ప్రభుత్వం ఆదేశించింది. ఆయనకు వివిధ రకాల పని ఒత్తిడి నేపథ్యంలో ప్రభుత్వం ఆలోచించి.. విచారణాధికారిగా మంగళగిరి పోలీసు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ డీఐజీని నియమించింది. ఈ మేరకు జారీ అయిన ఉత్తర్వులు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయానికి అందాయి.

ప్రవాసాంధ్రుల శ్రీవారి సేవకు ఏర్పాట్లు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శ్యామలరావు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రవాసాంధ్రులు శ్రీవారి సేవ చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారి సేవ చేసేందుకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు. మెడికల్, విద్య, ఇంజనీరింగ్, ఐటీ, క్యాటరింగ్, కల్చరల్, గోసేవ తదితర రంగాల నుంచి నిపుణులను ఇందులో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. మెడిటేషన్, యోగా, నైపుణ్యాభివృద్ధి, వైద్య సేవలు, సామర్థ్యాల పెంపు, అభిప్రాయ సేకరణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శ్రీవారి మహత్యం, తిరుమల ప్రాముఖ్యత, శ్రీవారి సేవ విధి, విధానాలు, సేవా నిరతి గురించి శిక్షణ ఇవ్వాలని సూచించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, డీఎస్ అల్లాడి మోహన్, జీఎం ట్రాన్స్‌పోర్ట్ శేషారెడ్డి, అన్నదానం ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి, డిప్యూటీ ఈవో రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

తిరుపతికి ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని తూర్పు ప్రాంతానికి ప్రత్యామ్నాయంగా రేణిగుంటలోని 33 కేవీ లైన్‌నుంచి విద్యుత్ సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. నాలుగేళ్ల కిందట పాత రేణిగుంట సమీపంలో డెడ్ అయిన 33 కేవీ విద్యుత్ లైన్లను తొలగించి, రైల్వే అనుమతులతో కేబుళ్లను ఏర్పాటు చేసినట్లు రేణిగుంట సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ రమేష్ తెలిపారు. ఇటీవల చంద్రగిరి సబ్ స్టేషన్‌లో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఐదు గంటలపాటు తిరుపతిలో అంధకారం నెలకొన్న విషయం తెలిసిందే.

ఈ క్రమంలో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించారు. రేణిగుంటలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి కరకంబాడి 33 కేవీ విద్యుత్ లైన్ల ద్వారా తిరుపతికి సరఫరా చేయవచ్చని తెలిపారు. ఈ ఏర్పాట్లు చేసిన వారిలో ఏఈ పుణ్యకోటి, సిబ్బంది తదితరులున్నారు.

ముక్కంటి ఆలయ భద్రత మరింత పటిష్ఠం


సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ భద్రతను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి అన్నా రు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలతో శుక్రవారం ఆలయంలోని ఎస్పీ ఎఫ్ సిబ్బంది, హోంగార్డులు, సెక్యూరిటీ సిబ్బందికి సీఐ పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్ము కశ్మీర్ పహల్గాంలో జరి గిన ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. ఎ లాంటి బ్యాగులు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఆలయం లోపలకు తీసుకెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఎస్పీఎఫ్ హెడ్ ఇన్‌ఛార్జి చంద్రమోహన్‌రెడ్డి, సీఎస్వో రవి తదితరులు పాల్గొన్నారు.

రుయాలో మాధవరెడ్డికి వైద్య పరీక్షలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో అరెస్టయిన పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డికి శుక్రవారం రుయాలో సీఐడీ అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం వైద్యులు అయనకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు.

మణిహారాలు..ఈ రెండు హైవేలు

● చిత్తూరు- తచ్చూరు హైవే పనులు నవంబరు నాటికి పూర్తి?

● వచ్చే ఏడాది జూన్‌లోగా బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పూర్తి

చిత్తూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రహదారులు నాగరికతకు చిహ్నాలు. అభివృద్ధికి సోపానాలు. ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా.. అందుకు రవాణా సౌకర్యాలు కీలకం. రాయలసీమలో వెనుకబడిన ప్రాంతమైన చిత్తూరు జిల్లాకు రెండు జాతీయ రహదారులు వరంగా మారుతున్నాయి. చిత్తూరు ప్రాంత అభివృద్ధికి ఇవి కీలకం కానున్నాయి. ఇందులో ఒకటి చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి కాగా.. రెండోది బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే. చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి పనులు ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి పూర్తి కానున్నాయి. బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పనులు మే చివరి నాటికి పూర్తి చేస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు. ఈ పనులు పూర్తయితే జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధిలో పరుగులు తీస్తుంది. ఫలితంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

రూ.4 వేల కోట్లతో.. నాలుగు ప్యాకేజీల్లో..

చిత్తూరు-తచ్చూరు ఆరు లేన్ల జాతీయ రహదారి చిత్తూరు సమీపంలోని మాపాక్షి వద్ద ప్రారంభమవుతుంది. ఈ పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ 0-43.8 కి.మీ వరకు ఉంది. ఇది ఏపీలో 38.8 కి.మీ, తమిళనాడులో 5 కి.మీ పొడవుంది. ఈ ప్యాకేజీ అంచనా విలువ రూ.1,484 కోట్లు. రెండో ప్యాకేజీ 43.8 కి.మీల నుంచి 61.3 కి.మీల వరకు మొత్తం 17.58 కి.మీల పొడవున ఉంది. ఏపీలో 5.88 కి.మీలు, తమిళనాడులో 11.70 కి.మీలు ప్రయాణిస్తుంది. ఈప్యాకేజీ అంచనా విలువ రూ.591.99 కోట్లు. మూడో ప్యాకేజీ 61.3 కి.మీల నుంచి 96 కి.మీల వరకు మొత్తం 34.66 కి.మీలు ఉంది. ఇది ఏపీలో 30.32 కి.మీలు, తమిళనాడులో 4.34 కి.మీలు పొడవున ఉంది. ఈ ప్యాకేజీ విలువ రూ.1,102.63 కోట్లు. నాల్గవ ప్యాకేజీ 96 కి.మీ నుంచి 116 కి.మీ వరకు ఉంది. ఏపీలో ఈ ప్యాకేజీ పనులు లేవు. 20 కి.మీలు కూడా తమిళనాడుకు సంబంధించినవే. ఈ ప్యాకేజీ అంచనా విలువ రూ.818.73 కోట్లు. ఈ ప్యాకేజీ పనులు ఈ ఏడాది నవంబరు 4వ తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యం చేసుకున్నారు. చిత్తూరు- తచ్చూరు హైవే చిత్తూరు జిల్లాలో 62.3 కిలోమీటర్లు, తిరుపతి జిల్లాలో 12.7 కి.మీలు ప్రయాణిస్తుంది. దీనికి చిత్తూరు 3.4 కి.మీ వద్ద, గంగాధరనెల్లూరు 12.4 కి.మీల వద్ద, శ్రీరంగరాజపురం 32 కి.మీల వద్ద, నగరి 60 కి.మీల వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉంటాయి.


చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి

చకచకా బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పనులు

చిత్తూరు జిల్లా మీదుగా వెళుతున్న బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ జాతీయ రహదారి మొత్తం పొడవు 267కి.మీ. ఈ ఎక్స్‌ప్రెస్ వే కర్ణాటకలోని బేతమంగళం వద్ద ప్రారంభమై బైరెడ్డిపల్లె, బంగారుపాళ్యం, గుడిపాల వరకు 85 కి.మీల పొడవున ఉంది. జిల్లాలో ప్రాజెక్టు అంచనా విలువ రూ.4,925కోట్లు. ఈ పనులను మూడు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ 25కి.మీలు. ఇందులో కర్ణాటకలో 4.5 కి.మీలు, ఏపీలో 20.5 కి.మీల పొడవున ఉంది. ఈ పనులు ఇప్పటి వరకు 80శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది జూన్ చివరి నాటికి ఈ ప్యాకేజీ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రెండో ప్యాకేజీ 31కి.మీల పొడవున ఉంది. ఇది ఎక్కువ అటవీ ప్రాంతంలో ఉండటంతో పనులు ఆలస్యం అవుతున్నాయి. ఇప్పటి వరకు 60శాతం పూర్తయ్యాయి. ఈ ప్యాకేజీ పనులు వచ్చే ఏడాది జూన్ చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా ఎంచుకున్నారు. మూడో ప్యాకేజీ 29 కి.మీల పొడవున ఉంది. ఇప్పటి వరకు 93.7 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు ఈ ప్యాకేజీ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఎక్స్‌ప్రెస్ వేకు జిల్లాలో మూడు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉన్నాయి. కర్ణాటకలో 69 కి.మీల వద్ద ఒకటి ఉండగా.. జిల్లాలోని బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె వద్ద, బంగారుపాళ్యం మండలం మొగిలి వద్ద, గుడిపాల మండలం రామాపురం వద్ద పాయింట్లు ఉంటాయి.


బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే రహదారి

శిథిలావస్థలో స్లీపర్ ఏసీ బస్సులు

అరు నెలలుగా డిపో గ్యారేజీకి పరిమితమైన వైనం - స్థలాభావంతో సిబ్బందికి తప్పని ఇక్కట్లు


గ్యారేజీలో ఉన్న అద్దె స్లీపర్ ఏసీ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం తీసుకొచ్చిన అద్దె స్లీపర్ ఏసీ బస్సులు శిథిలావస్థకు చేరుకున్నాయి. నిర్వహణ లోపంతో ఆరు నెలలుగా డిపోలోని గ్యారేజీకే పరిమితమయ్యాయి. గ్యారేజీలో స్థలాభావంతో ఇతర బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తిరుపతి-హైదరాబాదు స్లీపర్ ఏసీ బస్సులకు ఆదరణ ఎక్కువగా ఉందని భావించి ఆర్టీసీ ఉన్నతాధికారులు అద్దె బస్సులకు అవకాశం కల్పించారు. వీటి నిర్వహణ బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 2023 ఫిబ్రవరి 24న వెన్నెల ఏసీ స్లీపర్ సర్వీసు(రెండు బస్సులు) ప్రారంభించారు. కొంతకాలం అవి సజావుగానే నడిచాయి. క్రమేణా నిబంధనలను పక్కనపెట్టి కాంట్రాక్టర్ మొక్కుబడిగా తిప్పడం ప్రారంభించాడు. అదనంగా అటెండర్‌ను నియమించలేదు. బస్సు నిర్వహణ ప్రమాణాలు పాటించలేదు. సకాలంలో మరమ్మతులు చేయలేదు. టైర్లు పూర్తిగా అరిగిపోయినా పట్టించుకోలేదు. కేవలం రాబడే పరమావధిగా తిప్పాడు. గతేడాది మేలో తిరుపతి నుంచి బయల్దేరి వెళుతుండగా రాత్రిపూట ఒంటిమిట్ట వద్ద టైరు పంక్చరైంది. మార్చుచేసి నడపగా మళ్లీ మైదుకూరు వద్ద మరో టైరు పంక్చరైంది. ఈ కారణంగా రెండు గంటలపాటు ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఫిర్యాదులు ఎక్కువ కావడంతో అధికారులు పలుమార్లు కాంట్రాక్టర్‌ను హెచ్చరించినా లాభం లేకపోయింది. అగ్రిమెంట్ రద్దుకు షోకాజ్ నోటీసులు జారీ చేసినా స్పందన కరువైంది. ఈ క్రమంలో గత జనవరి ఒకటో తేదీన కాంట్రాక్టు రద్దు చేశారు. బస్సులను ఆరు నెలలుగా డిపో గ్యారేజీలో ఉంచారు. దుమ్ము, తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. తద్వారా మిగతా బస్సులను పార్కు చేసేందుకు, ఇంధనం నింపేందుకు డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. దీనిపై దృష్టి సారించిన అధికారులు వాటిని రెండు మూడు రోజుల్లో బయటకు తరలించే ఆలోచన చేస్తున్నారు. రోజూ రాత్రి 9.30 గంటలకు సీబీఎస్ నుంచి హైదరాబాదుకు బయల్దేరుతున్న వెన్నెల స్లీపర్ ఏసీ(అద్దె బస్సు) స్థానంలో ఆర్టీసీ సొంత బస్సు ఇంద్రా ఏసీని నడుపుతున్నారు.

హైదరాబాదులో ముగిసిన రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు


రామకృష్ణారెడ్డి పార్థివదేహం

వెదురుకుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఆచార్య బండి రామకృష్ణారెడ్డి(84) అంత్యక్రియలు శుక్ర వారం హైదరాబాదు తార్నాకలోని చంద్రమతి ఆర్యన్ శ్మశాన వాటిలో పూర్తయ్యాయి. అంతకుముందు తార్నాకలోని గాయత్రి టవర్స్‌లో రామకృష్ణారెడ్డి భౌతిక కాయాన్ని ఉంచారు. హైదరాబాదు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ జి.నరేష్‌రెడ్డి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్లు ఆచార్య ఎస్.భక్తవత్సలరెడ్డి, ఆచార్య వి.సత్తిరెడ్డి, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ చెన్నకేశవరెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ మునిరత్నం నాయుడు, డాక్టర్ నామిని సుదాకర్‌నాయుడు నివాళి అర్పించారు. బెంగళూరు, తిరుపతి, కుప్పం, కడప నుంచి పలువురు అంత్యక్రియలకు హాజరయ్యారు. రామకృష్ణారెడ్డి కుమార్తె బండి పద్మిని చితికి నిప్పంటించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యాధికారులు జయంతి, సుకన్య

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల ఉత్పత్తిని నియంత్రించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ జయంతి, డాక్టర్ సుకన్య సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళం పరిధిలోని సప్తగిరికాలనీలో శుక్రవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బ్యానర్ ప్రదర్శిస్తూ దోమల వల్ల కలిగే నష్టాలు, డ్రైడే, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. నర్సులు, ఆశావర్కర్లు, నర్సింగ్ ట్రైనింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నేతపై వైసీపీ దాడి


గాయపడిన ఈశ్వర్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఓటేరులో శుక్రవారం బీజేపీ నేత దేవాంగుల ఈశ్వర్‌పై కొందరు వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. బీజేపీ కార్యనిర్వాహక సభ్యుడు ఈశ్వర్ తన స్నేహితుడు ఇంట్లో కూర్చుని క్రికెట్ మ్యాచ్ చూసి, ఇంటికి వెళుతున్నాడు. నాగులమ్మ ఆలయ సమీపంలో అతని స్నేహితుడు నాగేశ్వరరావు కుమారుడు పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్నారు. అక్కడే ఉన్న శశికుమార్ తన కళ్లజోడును తీసుకున్నాడంటూ ఈశ్వర్‌తో గొడవపడ్డాడు. గతంలో జరిగిన గ్రామసభల్లో తమ గురించి కించపరుస్తూ మాట్లాడాడని అక్కడే ఉన్న జనసేన వార్డు మెంబరు సాయిరాం, వైసీపీ నేత చంద్రమౌళి అనుచరులు శశికుమార్, చోటసాయి, నాగేశ్వరరావు, హరీష్ ఈశ్వర్, సాయిరాంపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శశికుమార్, చోటసాయి, సాయిరాం, నాగేశ్వరరావు, హరీష్‌లపై కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

తిరుపతి

విద్యుత్ కోతలుంటే ఈ నంబర్లను సంప్రదించాలి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తమను సంప్రదించాలని డీఈఈ వి.ఆంజనేయులు ఒక ప్రకటనలో కోరారు. ఆయా విద్యుత్ ఉప కేంద్రాల అధికారులను సంప్రదిస్తే సత్వరమే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

- గోవిందరాజస్వామిగుడి 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరధిలోని గాంధీరోడ్డు, కర్ణాలవీధి, చిన్నబజారువీధి, పట్నూలువీధి, పరసాలవీధి, చింతకాయలవీధి, బేరివీధి, రామచంద్ర పుష్కరిణి (ఏఈ మునిరాం-94928 06890).
- అలిపిరి సెక్షన్ 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని కపిలతీర్థం, ఖాదీకాలనీ, రామచంద్రనగర్, వరదరాజనగర్, భవానీనగర్, చెన్నారెడ్డికాలనీ, గిరిపురం, ఎస్టీవీకాలనీ, సప్తగిరినగర్, కె.టి.రోడ్, హౌసింగ్ బోర్డు కాలనీ, సింగాలగుంట, మంచాల వీధి, అన్నారావుసర్కిల్, ఇర్లానగర్, ప్రశాంతి నగర్, స్విమ్స్‌క్వార్టర్స్, ఇస్కాన్‌రోడ్, అనంతవీధి, కనకభూషణ్ లేఅవుట్ (ఏఈ ఉమాపతి-9490615001).
- బాలాజీకాలనీ 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని బాలాజీకాలనీ, ఎల్ఐసీకాలనీ, నేతాజీనగర్, జ్యోతి థియేటర్, ఇందిరానగర్, ఎస్వీ వెటర్నరీ కాలేజీ, సంస్కృత విద్యాపీఠం, పద్మావతి గెస్ట్‌హౌస్, బొమ్మగుంట, శాలివాహననగర్, కె.వి.లేఅవుట్, నెహ్రూనగర్, ఎస్సీటీ కాలనీ, హమీద్ నగర్, కుమ్మరితోపు, సరోజినీదేవి లేఅవుట్, ప్రకాశం రోడ్డు, రిజర్వాయర్ కాలనీ, గిరిపురం (ఏఈ పి.రామాంజనేయులు-9490615002).
- రాజీవ్‌నగర్ 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని వైకుంఠపురం ఆర్చి, ముత్యాలరెడ్డిపల్లి, శేషాద్రినగర్, న్యూబాలాజీకాలనీ, ఎస్వీ నగర్, మారుతీనగర్, వానవినగర్, శ్రీకృష్ణనగర్(ఏఈ బాలగున్నయ్య-9490615003).

బీసీలపై అగ్రకులాల ఆధిపత్యం తగదు

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఏఎన్‌కండ్రిగ గ్రామంలో బీసీలపై అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగుతోందని, దీన్ని అరికట్టాలని జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు కల్లూరు నాగరాజు గౌడ్ కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బీసీ కులాల వారిని అగ్రకులస్థులు తక్కువ చేసి మాట్లాడటం సరికాదన్నారు. బీసీ కులానికి చెందిన నిర్మలకు సంబంధించిన భూముల్లో రాత్రికి రాత్రే స్తంభాలు నాటి ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో చంద్రశేఖర్, తరంగిణి పాల్గొన్నారు.

చదువే ఆయుధం

నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ

ఘనంగా పద్మావతి వర్సిటీ కాలేజీ డే


సభలో పాల్గొన్న వీసీ ప్రసన్నశ్రీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మహిళకు చదువే ఆయుధమని రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీ కాలేజీ డే శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. మహిళలు విద్యావంతులైతే సమాజంలో మార్పు వస్తుందన్నారు. చదువుకుంటే వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వీసీ ఉమ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులు చదువుకోవడానికి ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ వచ్చుదనం, పరిశుభ్రత పాటిస్తున్నట్లు చెప్పారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఎన్ఈపీపై హెచ్ఎంలకు అవగాహన

తిరుపతి(విశ్వవిద్యాలయాలు),ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానంపై దేశంలో ఎంపిక చేసిన 50 మంది హెచ్ఎంలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం పద్మావతి వర్సిటీలో ప్రారంభమైంది. ఎన్ఈపీకి సంబంధించిన అంశాలపై హెచ్ఎంలకు నిపుణులు అవగాహన కల్పిస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ : ఒకరికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడిన ఘటన శుక్రవారం రామచంద్ర పుష్కరిణి వద్ద చోటు చేసుకుంది. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. తిరుపతికి చెందిన ఆటోడ్రైవర్ అబి స్థానిక ఐఎస్ మహల్, చుట్టుపక్కల ప్రాంతాల్లో వాటర్ క్యాన్లు విక్రయిస్తున్నాడు. అతనితో పాటు పైలెట్ డ్రైవర్‌గా రాబి ఉన్నాడు. బొమ్మగుంటకు చెందిన పొన్నాల రాజశేఖర్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్‌కు చెందిన వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టును పాలకొల్లు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. చిగురువాడ కొత్తూరు గ్రామానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త హరిప్రసాద్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, అతని భార్యపై ట్విట్టర్ వేదికగా అసభ్య పోస్టింగ్స్ పెట్టారు. దీనిపై పాలకొల్లు పోలీసులకు ఫిర్యాదు రావడంతో తిరుపతికి వచ్చి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు.

పారదర్శక ఓటర్ల జాబితా తయారు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్వో నరసింహులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, డీటీ ఉషారాణి, రాజకీయ పార్టీల నేతలు నాగరాజు, పురుషోత్తం నాయుడు, నగేష్ పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్య ఆరోగ్య శిబిరాలు


విద్యార్థులతో వీసీ జేవీ రమణ, జగపతిరామయ్య, రాంబాబునాయక్

తిరుపతి రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మూగ జీవాలకు సేవచేసే అవకాశం లభించడం అదృష్టంగా భావించాలని ఎస్వీ వెటర్నరీ వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ కోరారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించిన ఏడు రోజుల పశువైద్య ఆరోగ్య శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి అభినందించారు. అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.జగపతిరామయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఫిజియాలజీ హెడ్ ప్రొఫెసర్ బి. రాంబాబునాయక్ పాల్గొన్నారు.

నీటిశుద్ధి యంత్రం రూపకల్పన

పద్మావతి వర్సిటీ విద్యార్థినికి అవార్డు


కుందనసాయిని అభినందిస్తున్న ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కలుషితమైన నీటిని శుద్ధి చేసే యంత్రాన్ని పద్మావతి యూనివర్సిటీ బయో టెక్నాలజీ విద్యార్థిని కుందన సాయి రూపొందించింది. ఇటీవల నాగార్జున వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఆవిష్కరణకు కుందన సాయి అవార్డు పొందారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం లబ్ధిదారులకు అందించారు. నెహ్రూవీధికి చెందిన అక్కన్నగారి రమేష్‌బాబుకు రూ.2,73,800, చెన్నారెడ్డికాలనీకి చెందిన జహీరున్‌కు రూ.75,942, బైరాగిపట్టెడకు చెందిన సాయిశివకు రూ.40వేలకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు రాజారెడ్డి, మహేష్‌యాదవ్, సుదాకర్, బాజ్జి, రాజేష్‌ఆచారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో మే 8 నుంచి 9 వ తేదీ వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు కోరారు. యశోదానగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. 8వ తేదీ కచ్చపి ఆడిటోరియంలో జరిగే బహిరంగ సభలో రైతులు, కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు టి.సుబ్రమణ్యం, బుజ్జి, వేణు, మాధవ్, జయంతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమాతా బాలికల ఆవాసం వార్షికోత్సవం


సభలో మాట్లాడుతున్న నగేష్

తిరుపతి(విద్య), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైల్వేకాలనీలోని కేశవసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమాతా బాలికల ఆవాసం మూడవ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ టి.ఎం.నగేష్ మాట్లాడుతూ కేశవ సేవా సమితి నిస్వార్థంగా సేవలందిస్తోందని, ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. డాక్టర్ హరిత, దువ్వూరి యుగంధర్ మాట్లాడుతూ ఇటువంటి సేవలలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్‌రావు, మహేశ్వర్, సోమశేఖర్, వెంకటాచలం, గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కోదండరామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో మే నెలలో విశేష ఉత్సవాలు జరగనున్నాయి. 3, 10, 17, 24, 31 తేదీల్లో సీతారామ లక్ష్మణుల మూలవర్లకు ఉదయం అభిషేకం చేస్తారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగిస్తారు, అనంతరం ఆలయంలో ఊంజలసేవ చేస్తారు. 2న ఆలయంలో పుష్పయాగానికి అంకురార్పణ చేపడతారు. 3న సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పుష్పయాగం జరుగుతుంది. 12న ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఉంటాయి. 18న అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 8 గంటలకు కోదండరామస్వామి ఆస్థానం, 22న రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ ఉంటుంది. 27న ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభిషేకం, రాత్రి 7 గంటలకు హనుమంత వాహనసేవ నిర్వహిస్తారు. 30న ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు.

పట్టించుకోండిసారూ!

పొంచివున్న ప్రమాదం


ఏటవాలుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కొర్లగుంట మారుతీనగర్‌లోని నడివీధి గంగమ్మ ఆలయం ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ కింద సిమెంట్ దిమ్మె నిర్మించి రెండు దశాబ్దాలు కావస్తుండడంతో తరచూ మరమ్మతులకు గురవుతోంది. ఎలుకల కలుగుల కారణంగా భూమి లోపల పట్టు కోల్పోయింది. దీంతో దిమ్మె వంగిపోయి ఏటవాలుగా ఊగుతోంది. పెద్ద వర్షం కురిస్తే కూలిపోయే స్థితిలో ఉంది. విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లింగని ర్ధారణ చట్టరీత్యా నేరమని, పరీక్షలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రి యాజమాన్యాలను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ చట్ట అమలుపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ లింగనిర్ధారణ చేస్తున్నట్లు కొన్ని స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్‌పై ఫిర్యాదులు వస్తున్నాయని, తనిఖీలు నిర్వహించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఐవో శాంతకుమారితో పాటు ఎన్జీవో ప్రతినిధులు కేవీ రమణ, గుర్రప్ప పాల్గొన్నారు.

కశ్మీర్ మృతులకు నివాళి


పాల్గొన్న ఉద్యోగులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి ఎస్వీయూ ఉద్యోగులు ఘన నివాళి అర్పించారు. ఏడీ బిల్డింగ్ ముందు జాతీయ పతాకాన్ని ప్రదర్శించి, మౌనం పాటించారు. మృతులకు సంతాపాన్ని, బాధిత కుటుంబాలకు సానుభూతిని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు.

జనసేన నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నేతలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 25: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి శుక్రవారం సాయంత్రం జనసేన నాయకులు నివాళి అర్పించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నేతృత్వంలో నాలుగుకాళ్ల మండపం వద్ద మానవహారం చేపట్టి ఉగ్ర దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు మృతి చెందగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళి అర్పించి, వారి కుటుంబాలను ఓదార్చారన్నారు. కాగా, మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్లానర్స్ అసోసియేషన్ నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందిన డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపు కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఈ తరగతులపై ఆసక్తి ఉన్న వారు ఈనెల 28వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 98499 06016లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గూగుల్‌తో త్వరలో టీటీడీ ఒప్పందం

తిరుమల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): గూగుల్ నుంచి ఏఐ సంబంధ ఐటీ సేవలు పొందేందుకు ఆ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకునేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. క్యూలైన్‌లో నిరీక్షణ సమయాన్ని తగ్గించడం, గదుల కేటాయింపు వంటి సేవల్లో ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని టీటీడీ నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. దీనిపై వివిధ సంస్థల డెమోలను పరిశీలించారు. ఈ సేవలు అందించేందుకు గూగుల్ సంస్థ ముందుకు రావడంతో వారితో ఎంవోయూ కుదుర్చుకోవాలని గత నెలలో జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం చేశారు. విధివిధానాలను టీటీడీ ఇప్పటికే సిద్ధం చేసింది. త్వరలో గూగుల్ టీం తిరుమలకు చేరుకుని అంగీకార పత్రంపై సంతకం చేయనుంది. ప్రస్తుతం టీటీడీ వినియోగిస్తున్న అప్లికేషన్లను పరిశీలించి, చేపట్టాల్సిన మార్పులు, పొందుపరచాల్సిన నూతన టెక్నాలజీ టూల్స్ వంటి వాటిపై దృష్టిసారించనుంది. ఇక ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్(మన మిత్ర)లో ఇప్పటికే ఉన్న నాలుగు సేవలతో పాటు మరో 15 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టీటీడీ ప్రయత్నాలు చేస్తోంది.

శ్రీవారిసేవలో మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం

తిరుమల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎస్, టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారికి తలనీలాలు సమర్పించుకున్న ఆయన శుక్రవారం వేకువజామున అభిషేకసేవలోనూ, ఉదయం వీఐపీ బ్రేక్‌లోనూ శ్రీవారిని దర్శించుకున్నారు.



ఆలయం ముందు ఎల్వీ సుబ్రహ్మణ్యం దంపతులు

సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.



బుధవారం హుండీ ఆదాయం: రూ.2.88 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,227

తలనీలాలు సమర్పించినవారు: 28,951



ఆర్మేన్‌పాడులో సాగు చేసిన అంతరపంటలు






శేషాపురంలోని మామిడిలో మిశ్రమ పంటలు



- మిశ్రమ పంటలతో నిరంతర ఆదాయం
- సేంద్రియ పద్ధతుల్లో వినూత్న సాగు



ఏటీఎం సాగుతో ఏడాదంతా సిరులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎనీటైం మనీ(ఏటీఎం) సాగు..ఇదేంటని విస్తుపోతున్నారా.. జిల్లాలో కొందరు రైతుల ఇప్పుడు ఇదే బాట పట్టారు. రోజూ నాలుగు డబ్బులు కళ్లజూస్తున్నారు. వ్యవసాయమంటే నష్టాలతో కూడుకున్నదని పెదవి విరిచేవారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కాలానుగుణ మార్పులను అన్వయించుకుంటూ సాగును కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో అంతర్‌పంటల సాగునే రైతులు(ప్రకృతి వ్యవసాయాధికారులు ఏటీఎంగా వ్యవహరి స్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో మామిడి, నిమ్మ, పొద్దుతిరుగుడు, జామ తదితర పంటలను మిశ్రమంగా సాగు చేస్తూ అధిక దిగుబడిని సాధిస్తున్నారు. నిరంతరం కొద్దోగొప్పో ఆర్జించగలుగుతున్నారు. జిల్లాలో 70శాతం మంది మహిళా రైతులు ఏటీఎం తరహాలోనే సేంద్రియ ఎరువుతో కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు. ఇవి హాట్‌కేకుల్లా అమ్ముడుపోతుండటంతో ఆనందంలో మునిగితేలుతున్నారు. గత యేడాది 43,646 మంది ప్రకృతి పద్ధతుల ద్వారా సాగు చేశారు. అందులో 20 రకాల మిశ్రమ పంటలు వేశారు. ఏడాదంతా ఆదాయం వచ్చే వంగ, టమోటా, మిరప,గోరుచిక్కుడు, బీర, కాకర,ముల్లంగి, క్యారెట్, బీట్రూట్ వంటి పంటల సాగుతో ఆదాయం పొందుతున్నారు.

రెట్టింపు ఆదాయం



పదవ తరగతి వరకు చదివాను. చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై మక్కువ. మా ఆయన సహకారంతో, వ్యవసాయాధికారుల సూచనలతో కొత్తకొత్త పద్ధతులు నేర్చుకుంటున్నాను. నిమ్మలో అంతర్ పంటలు సాగు చేస్తున్నాను. పొలం చుట్టూపై కంచెపై తీగజాతి కాకర, బీర, దోసకాయలను పండిస్తున్నాను. ఆకుకూరలు, కాయగూరలతో నిరంతరం ఆదాయం వస్తోంది. దీంతో పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా ఉంది. ఏటీఎం సాగులో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసంధానం చేయడంతో ఏటా సుమారు రూ.1.50లక్షల ఆదాయం వస్తోంది. కొంతమేర అప్పులు తీర్చాము. సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలను ఇళ్ల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

-కొడవలూరు మహేశ్వరి, అర్మేన్‌పాడు, ఓజిలి మండలం

ఏడాదిపొడవునా సాగు



ఇంటర్ చదువుకున్నాను. చదువుకుంటూనే పొలం పనుల్లో సాయం చేసేదాన్ని. వ్యవసాయంపై ఆసక్తి ఎక్కువ. క్రిమిసంహారక మందులతో ఖర్చు పెరిగి తక్కువ ఆదాయం వస్తుందని గుర్తించాను. సేంద్రియ పద్ధతులను అవలంబిస్తున్నాను. ఖర్చు తగ్గింది. ఆదాయం పెరిగింది. వ్యవసాయాధికారుల సూచనతో ఏడాదంతా ఆదాయం(ఏటీఎం)ఆర్జించేలా 20 రకాల అంతర్ పంటలు సాగు చేస్తున్నాను. గతంలో ఎకరాకు రూ.26వేలు ఖర్చయ్యేది. ప్రకృతి వ్యవసాయంలో రూ.19వేలు మాత్రమే ఖర్చవుతోంది. అంతర్ పంటల సాగుతో ఏడాదంతా ఆదాయం వస్తోంది. ఆర్గానిక్ ఆకుకూరలు, కూరగాయలకు డిమాండ్ ఏర్పడంతో ఊళ్లోనే అమ్ముడుపోతున్నాయి.

- దొండపాటి హేమలత, పాండురంగావారిపల్లె, చంద్రగిరి మండలం

ఆదాయంతోపాటు ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏటీఎం మోడల్స్‌తో నిరంతరం ఆదాయం తెచ్చే అంతరపంటల సాగుకు ప్రోత్సాహన్ని అందిస్తున్నాం. తరచూ ఆదాయం రావడంతో రైతులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. అదే సమయంలో ప్రకృతి పద్ధతులను అనుసరించేలా సూచనలిస్తున్నాం. ఈసేద్యం వల్ల రైతాంగానికి ఆదాయంతో పాటు ప్రజల ఆరోగ్యానికి దోహదపడే వ్యవసాయ ఉత్పత్తులు వస్తున్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా వ్యవసాయాశాఖాధికారి ప్రసాద్‌రావుల ప్రోత్సాహంతో ఈ యేడాది 72,392ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా చర్యలు చేపడుతున్నాం. గత యేడాది 43,646ఎకరాల్లో సాగయ్యింది.

- షణ్ముగం, డీపీఎం, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం

రోజూ డబ్బులు కళ్లజూస్తున్నాం

గతంలో వ్యవసాయం చేస్తే ఖర్చులు పెరిగి అప్పులే మిగిలేవి. దీంతో కొందరు రైతులను స్ఫూర్తిగా తీసుకున్నాను. వారి తరహాలోనే రెండు ఎకరాల పొలంలో సేంద్రియ పద్ధతిలో అంతర్ పంటలు వేశాను. ఆదాయం పెరిగింది. మిశ్రమ పంటల సాగుతో ఏడాదికి రూ.1.48 లక్షలు ఆదాయం వస్తోంది. మామిడిలోనే అంతర పంటలను సాగు చేస్తున్నాను. నా భూమిని రసాయనరహితంగా మార్చుకున్నాను. ఇప్పుడు బాగా దిగుబడి పెరిగింది.



- కె.రాజగోపాల్‌నాయుడు, శేషాపురం, చంద్రగిరి మండలం



ట్రైనీ ఎస్పీ హేమంత్ సేవలు అభినందనీయం



హేమంత్‌ను అభినందిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ట్రైనీ ఎస్పీ హేమంత్ పోలీసు శాఖకు అందించిన సేవలు అభినందనీయమని ఎస్పీ హర్షవర్ధన రాజు అన్నారు. జిల్లాలో ఆరు నెలల పాటు పనిచేసి వెళుతున్న హేమంత్‌కు శుక్రవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు అతిథి గృహంలో అభినందన సభ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ హేమంత్ తన వద్ద శిక్షణ పొందడం సంతోషంగా ఉందన్నారు. హేమంత్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు చాలా బాగున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, రవిమనోహరాచారి, రామకృష్ణ, డీఎస్పీలు భక్తవత్సలం, ప్రసాద్, విజయశేఖర్, శ్రీనివాసులు, కంట్రోలు రూమ్ సీఐ ఈశ్వర్ పాల్గొన్నారు.

8మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

- 12 దుంగలు, మోటారు సైకిల్ స్వాధీనం

మంగళం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వీరబల్లి అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి 8 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. 12 ఎర్రచందనం దుంగలతో పాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం స్థానిక ఎఫ్‌బీవో అనిల్ కుమార్‌తో కలిసి గురువారం నుంచి వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం ఉదయం క్వారీ పాయింట్ వద్ద కొందరు మోటారు సైకిల్‌తో కనిపించారు. పోలీసులను గమనించిన పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని చుట్టుముట్టి 8మందిని పట్టుకోగలిగారు. పరిసర ప్రాంతాల్లో దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు



ఎర్రచందనం కేసుల్లో ముగ్గురికి జైలు, జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రెండు వేర్వేరు కేసుల్లో ముగ్గురు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తులు శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా గుడుపల్లెకు చెందిన సెల్వం కొన్నేళ్లుగా శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం చెట్లు నరికి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో 2022లో బీటీఆర్ కాలనీ అటవీ ప్రాంతం పరిధిలోని తిమ్మినాయుడుపాలెం బీట్‌లో గొడ్డలి, కత్తి తీసుకుని అడవిలోకి వెళుతుండగా అప్పట్లో అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఇతడిని రిజర్వు ఎస్ఐ వినోద్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మూడేళ్ల పాటు విచారణ సాగింది. తాజాగా రాష్ట్ర ఎర్రచందనం కోర్టులో ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సెల్వంకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష రూ మూడు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఫారెస్టు బీట్ అధికారులు చెప్పారు.

- నెల్లూరు జిల్లా రాపూరు మండలానికి చెందిన చల్లా రమణయ్య, బత్తల పెంచలయ్య కలసి 2014లో రాపూరు రేంజ్ పరిధిలో నుంచి 83 కిలోల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలను తీసుకెళుతుండగా అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. తొలుత ఈ కేసు విచారణ వెంకటగిరి కోర్టులో సాగింది. ఆ తర్వాత తిరుపతి ఎర్రచందనం కోర్టుకు బదిలీ అయింది. కొంత కాలంగా వాదనలు సాగాయి. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి శ్రీకాంత్.. ఈ ఇద్దరు నిందితులకు ఏడాది పాటు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.ఐదువేల చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో ఏపీపీగా రామశాంతి వాదనలు వినిపించారు. లైజన్ అధికారిగా చంద్రశేఖర రాజు, ఎం.రఘు వ్యవహరించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమణ ప్రసాద్

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రారంభమైనట్లు స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర, తిరుపతిలో రాష్ట్ర పర్యాటక శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషన్‌లో 2025-26 సంవత్సరానికి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. బీఎస్సీ మూడేళ్ల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరీ కోర్సుకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీసు కోర్సులకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఎలాంటి వయోపరిమితీ లేదన్నారు. ఈ కోర్సులు పూర్తయిన తర్వాత ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. బ్యాంకు రుణ సదుపాయం ఉందన్నారు. బాలబాలికలకు వేర్వేరు హాస్టల్ వసతి ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9701343846, 9100558006, 9700440604లను సంప్రదించాలని కోరారు.

పుత్తూరులో జమ్మూకశ్మీర్ యువకులు

- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు
- విచారించి వివరాల సేకరణ

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో జమ్మూకశ్మీర్ యువకులను చూసి పుత్తూరు ప్రజలు అనుమానించారు. పట్టణంలోని కావమ్మ గుడి ఎదురు కాలనీలో ముగ్గురు యువకులు ఉండడం, వీరంతా 25 ఏళ్ల వారు కావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వీరిని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ముషాదిక్ హుస్సేన్, పంకజ్, అహ్మాద్ హుస్సేన్‌ను ఎస్ఐ ఓబయ్య పిలిపించి విచారించారు. వీరు జమ్మూకశ్మీర్‌లోని రాంబన్‌కు చెందిన వారుగా తెలిసింది. దాదాపు 6 నెలల కిందటే అరక్కోణం, పుత్తూరు తదితర ప్రాంతాల్లో రైల్వే కాంట్రాక్ట్ పనులు చేసుకుంటున్నట్లు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. ఎటువంటి అనుమానాస్పద పరిస్థితులు లేవన్నారు. వారిని పూర్తిస్థాయిలో విచారించాక, వివరాలు సేకరించుకుని పంపించేశారు.

సమ్మెను జయప్రదం చేయండి



లేబర్ కోడ్ బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న మధు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాయడాన్ని నిరసిస్తూ వచ్చే నెల 20వ తేదీన చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పెనుమల్లి మధు కోరారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో లేబర్ కోడ్ బుక్‌లెట్లను ఆయన ఆవిష్కరించారు. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సవరణ చేసిన ఈ చట్టాలు కార్పొరేటర్లకు అనుకూలంగా ఉన్నాయన్నారు. సమ్మెలో రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలసుబ్రమణ్యం, కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర. వేణుగోపాల్, మాధవ్, బుజ్జి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో 'మయూర' జయరాం చౌదరి

- ఎన్ఐ యాక్ట్ కేసులో అరెస్టుకు కోల్‌కతా హైకోర్టు ఆదేశం

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన మయూర షుగర్స్ అధినేత జయరామ చౌదరిని ఈస్ట్ పోలీసులు చెన్నైలో అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కోల్‌కతాకు చెందిన టిరాయ్ ఓవర్సీస్ సంస్థకు చక్కెర సరఫరా చేస్తామని 2014లో జయరామచౌదరి ఒప్పందం కుదుర్చుకుని రూ.8 కోట్లు అడ్వాన్సుగా తీసుకున్నారు. ఆ తర్వాత ఫ్యాక్టరీ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తడంతో చక్కెర సరఫరా చేయలేదు. అడ్వాన్సుగా తీసుకున్న రూ.8 కోట్లలో రూ.3 కోట్లు వెనక్కు చెల్లించారు. ఇంకా రూ.5 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉండటంతో 2023లో టిరాయ్ ఓవర్సీస్ సంస్థ కోల్‌కతా హైకోర్టులో ఎన్ఐ యాక్ట్ కింద కేసు వేసింది. ఆ క్రమంలో హైకోర్టు ఆయనపై అరెస్టు వారంట్ జారీ చేసింది. తిరుపతి జిల్లా పరిధిలో నివాసం ఉన్నందున ఆయన్ను అదుపులోకి తీసుకుని కోల్‌కతా పోలీసులకు అప్పగించాలని ఎస్పీని ఆదేశించింది. ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలతో ఈస్ట్ పోలీసులు అధికారులు, సిబ్బంది కలసి చెన్నై నగర శివార్లలోని ఓ లాడ్జీలో వున్న జయరామ చౌదరిని శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం తిరుపతికి బయలుదేరారు. ఎస్పీ ద్వారా కోల్‌కతా పోలీసులకు అప్పగిస్తారని సమాచారం.

ఎస్వీయూ పరీక్షల అధికారిగా రాజమాణిక్యం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరీక్షల అధికారి(సీఈ)గా డాక్టర్ రాజమాణిక్యం నియమితులయ్యారు. దామ్లానాయక్ స్థానంలో ఈయన్ను నియమిస్తూ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పరీక్షల అధికారిగా రాజమాణిక్యం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఐరాల మండలం వడ్రాణంపల్లెకు చెందిన రాజమాణిక్యం, ఎస్వీ యూనివర్సిటీలోనే పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1986లో తెలుగు విభాగంలో అటెండరుగా ఉద్యోగంలో చేరారు. జూనియర్ అసిస్టెంట్‌గా పరీక్షల విభాగంలో సేవలందించారు. సెంట్రల్ లైబ్రరీలో సీనియర్ అసిస్టెంట్‌గా, ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో సూపరిండెంట్‌గా, ఇంజినీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఏవో)గా, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ (ఈ-2)లో అసిస్టెంట్ రిజిస్ట్రారుగా, పరిపాలనా భవనంలోని అడ్మినిస్ట్రేటివ్ బ్రాంచ్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఈ నేపథ్యంలో సీఈగా నియమితులైన రాజమాణిక్యంను పలువురు అభినందించారు.

19 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సొసైటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 24 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొంది. పరీక్షా కేంద్రాలు కేటాయించాలని ప్రభుత్వ పరీక్షల విభాగానికి లేఖ రాసినట్లు తెలిపింది. మే 26 నుంచి 30 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొంది.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ



వర్మికంపోస్టు తయారీపై అవగాహన కల్పిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శిరీష, డీఎల్‌పీవో వెంకటరమణ

బాలాయపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) చెత్తతో నుంచి సంపద తయారీతో పంచాయతీలకు ఆదాయం చేకూరడంతో పాటు పర్యావరణాన్ని రక్షించు కోవచ్చుని డీఎల్పీవో వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక సంపద తయారీ కేంద్రం వద్ద గూడూరు డివిజన్‌లోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 134 మంది పంచాయతీ కార్యదర్శులకు మన వ్యర్థాల నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారు చేసే విధానాన్ని వివరించారు. తడి పొడి చెత్తపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ వల్ల పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రాజు, ఎంఈవో వెంకటేశ్వర్లు, సర్పంచు దట్టం అంజలి, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు, పంచాయతీ కార్యదర్శి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మకాలనీలో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి శిలావిగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలను మే 3,4 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు వాటంబేడు శివకుమార్ తెలిపారు. ఆలయ కుంభాభిషేకం సందర్భంగా మే 5నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో మెకోస్డియా వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగార్జున

కోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మెక్సోడియా 2025 వేడుకలు జరిగాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉత్తర కొరియా బహుళ జాతి సంస్థ టాటా ఎల్క్సి కంపెనీ లీడ్ డిజైనర్ నాగార్జున మాట్లాడుతూ డిజైన్ ఇంజనీరింగ్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో రోబోటిక్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ఎంటెక్ కోర్సును ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిలికా, క్వార్ట్జ్ గనులను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కేటాయించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చింతామోహన్

గూడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సిలికా, క్వార్ట్జ్ గనులను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నిరుద్యోగ యువతకు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలంలో సిలికా గనులు, వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురంలో క్వార్ట్జ్ గనుల్లో మైనింగ్ నిర్వహణ కొందరికే ఇస్తున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు మైనింగ్ అనుమతులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, వెంకటయ్య, శివ, పెంచలయ్య, దయాకర్, చంద్రశేఖర్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గూడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెల్‌క్యాస్ట్ కర్మాగారంలో శుక్రవారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పరిశ్రమలో పనిచేసే సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ వెస్ట్‌క్లబ్ సభ్యులు ఎల్లసిరి గోపాలరెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆనిమెళ్ల శివకుమార్, నవీన్ జయకుమార్, నాశిన నాగులు, గిరిబాబు, వాసుగౌడ్, ధనుంజయరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, వెంకటేషన్, ప్రభ, సనత్ కుమార్‌రెడ్డి, డాక్టర్లు సతీష్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్, శ్రీనివాసులునాయుడు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ధర్మరాజస్వామి ఉత్సవాలు



స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడు కుప్పం గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు శుక్రవారం వేడుకగా మొదలయ్యాయి. 25 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఉత్సవాల్లో శుక్రవారం ధ్వజారోహణం జరిగింది. అనంతరం వేదపండితులచే మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జీ నెలవల సుబ్రమణ్యం స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. వారిని ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. రాత్రి గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమాలలో టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, ఆకతోట రమేష్, బొమ్మన శ్రీధర్, వేలూరి చంద్రయ్య, పప్పు శంకరయ్య బొమ్మన పళని తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 3నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుభకర్‌రావు తెలిపారు. 3వ తరగతిలో 80సీట్లు, 4వ తరగతిలో 78, 5వ తరగతిలో 72, 6వ తరగతిలో 59, 7వ తరగతిలో 22, 8వ తరగతిలో 1(ఎస్టీ), 9వ తరగతిలో 11 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. వివరాలకు 63090 89327 నంబరును సంప్రదించాలని సూచించారు.

పోక్సో కేసు నమోదు

దొరవారిసత్రం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 22వ తేదీన మండలంలోని కట్టువపల్లి గ్రామానికి చెందిన అందలమాల శివ ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి తల్లిదండ్రులు గురువారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

ఓజిలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియకు చెందిన గిరిజన మహిళ నాగభూషణమ్మ(57) అప్పుల బాధతో గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు జగన్నాధం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదాల నిలయంగా హోలిక్రాస్ కూడలి



హోలిక్రాస్ కూడలి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి సూళ్లూరుపేట పట్టణంలోకి వచ్చే హోలిక్రాస్ జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటు చెన్నై, అటు నెల్లూరు, షార్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు, పట్టణంలో నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు హోలిక్రాస్ జంక్షన్ గుండా వెళ్లాల్సి ఉంటుంది. నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఒకేచోట క్రాస్ అవ్వాల్సి ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పరిశ్రమలకు వెళ్లే వాహనాలు, షార్‌కు వెళ్లే ప్రైవేట్ వాహనాలు ఒకేసారి క్యూకట్టినట్లు వస్తుండడంతో ఏ వాహనాలు ఎటువైపు తిరుగుతాయో తెలియని పరిస్థితి. షార్ కేంద్రానికి వెళ్లేందుకు కూడా ప్రధాన కూడలి మార్గం కావడంతో ఒక్కొక్కసారి భారీ వాహనాలు వస్తున్నాయి. ఆ సమయంలో వాహనాలు వెళ్లాలంటే నరకం కనబడుతోంది. పరిశ్రమలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు ఎక్కడ పడితే అక్కడ అకస్మాత్తుగా ఆగుతుండంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గురువారం ఓ కంపెనీ బస్సు ఢీకొనడంతో కార్మికుడు మృతి చెందాడు.

ప్రమాదాల నివారణకు చర్యలు

హోలిక్రాస్ కూడలిలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన హోలిక్రాస్ కూడలిని పరిశీలించారు. బుధవారం ఇక్కడ జరిగిన ప్రమాదంలో అపాచీ కార్మికుడు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో డీఎస్పీ సంఘటన స్థలాన్ని పరిశీలించి సిబ్బందిని వివలాడిగి తెలుసుకున్నారు. కూడలి వద్ద వాహన రాక పోకలను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వేటూరి బ్రహ్మనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



కూడలిని పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు

ప్రభుత్వం హామీలన్నీ అమలు చేస్తోంది: టీడీపీ

కోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని మత్స్యశాఖ కార్యాలయంలో ఎఫ్‌డీవో రెడ్యా నాయక్‌తో పాటు టీడీపీ నేతలు విలేకరులతో మాట్లాడారు. చేపల వేట విరామ సమయంలో మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున అందించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని తెలిపారు. శనివారం శ్రీకాకుళంలో మత్స్యకార కుటుంబాలకు ఎన్టీఆర్ మత్స్యకార భరోసా నగదు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతారన్నారు. గత ప్రభుత్వం చేపల వేట నిషేధ సమయంలో ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు మాత్రమే ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రూ.20వేలకు పెంచారని అన్నారు. కోట మండలంలో 258మంది మత్స్యకారులకు ఎన్టీఆర్ మత్స్యకార భరోసా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, వెంకన్నపాళెం సర్పంచు కోశర్ల మధుయాదవ్, మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అక్బర్, ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్ పాల్గొన్నారు.

వాకాడు మండలంలో 1172 మందికి..

వాకాడు: మండలంలోని 1172 కుటుంబాలకు మత్స్యకార భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.2.35 కోట్లు ఇవ్వనుందని టీడీపీ మండలాధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మొత్తం 1172 కుటుంబాలకు రూ.20 వేల చొప్పున అందించేందుకు చర్యలు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రానున్న రోజుల్లో మత్స్యకారుల జీవన ప్రగతిని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక వనరులు సమకూరేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు.



మత్స్యశాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

గూడూరు అర్బన్: చేపల వేట విరామ సమయంలో మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున అందించేందుకు చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సముద్రంలో మత్స్య వనరులను రక్షించడానికి ఏప్రిల్ 15నుంచి జూన్ 14వ తేదీ వరకు చేపల వేట నిషేధించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో మత్స్యకారుల జీవనోపాధి కోసం గత ప్రభుత్వం అందించిన రూ.10 వేలను సీఎం చంద్రబాబు రూ.20 వేలకు పెంచారన్నారు. దీంతో నియోజకవర్గంలో 2262 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.4.52 కోట్ల పరిహారం అందనుందన్నారు. నియోజకవర్గ మత్స్యకారుల తరుఫున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 65 అర్జీలు అందాయి. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, కిషోర్, మాధవ నాయుడు, సుబ్రహ్మణ్యం, కొక్కు శంకరయ్య, తిరుపాల్, సతీష్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు రూ.5.33 లక్షల సాయం



చిన్నారి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు రమేష్, శంకరయ్య

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామరాయి పంచాయతీ కొల్లపట్టు గ్రామానికి చెందిన మాగర్ల శాన్వి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5.33 లక్షల చెక్కును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టుక నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి వెంటనే ఆర్థిక సాయం అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, మాధవనాయుడు, తిరుపాల్, వేనాటి చంద్రారెడ్డి, మురళీరెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, మునీంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమాంబట్టు గ్రామంలో వెలిసిన కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో శుక్రవారం చైత్రమాసం ద్వాదశిని పురస్కరించుకుని స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. గోపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదాల వితరణ జరిగింది.

విద్యార్థులకు నగదు బహుమతి



విద్యార్థులను సత్కరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయురాలు రాజేశ్వరి

తడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులు వర్షిత, శ్రావ్య పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపడంతో వారిద్దరినీ సత్కరించి రూ.1116 నగదు బహుమతి అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు బట్టా రాజేశ్వరి, తిరుపతి స్విమ్స్ వైద్యుడు మునుస్వామి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

కోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ ట్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చిల్లకూరు దశరధరామిరెడ్డి, తిరుమూరు మురళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశమ్మకు పొంగళ్లు

కోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చెందోడు గ్రామదేవత దేశమ్మకు శుక్రవారం గ్రామస్తులు మేళతాళాల మధ్య సామూహిక పొంగళ్లు నిర్వహించారు. ఏటా వరి కోతలు, పంటల నూర్పిడి అనంతరం గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ ఏడాది రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలు బాగా పండడంతో అమ్మవారికి చద్ది అంబళ్లు, మేళతాళాలతో పొంగళ్లు పెట్టారు.

కూలర్ల వితరణ



సచివాలయానికి కూలర్ అందజేస్తున్న వేలూరు కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ వేలూరు కల్యాణ్‌రెడ్డి తన తాత వేలూరు జనార్దనరెడ్డి జ్ఞాపకార్థం తన స్వగ్రామమైన శిరసనంబేడు గ్రామ సచివాలయం, పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌కు రూ.30 వేల విలువ చేసే కూలర్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, కుంపటి సునీల్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీకి హైడ్రాలిక్ బెడ్ వితరణ



బెడ్‌ను అందజేస్తున్న సింహపురి రెడ్డి సంక్షేమసంఘం సభ్యులు

చిల్లకూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీకి సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాటిపర్తి సుగుణమ్మ సహకారంలో రూ.20 వేలు విలువ చేసే హైడ్రాలిక్ బెడ్‌ను శుక్రవారం వితరణగా కార్యక్రమంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సనత్ కుమార్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, తేజస్విని, ధనుంజయరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజేంద్రరెడ్డి, సిద్దారెడ్డి, హరినాధరెడ్డి, దయాకర్‌రెడ్డి, హరిరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచుకు నేతల నివాళి

దొరవారిసత్రం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన పూలతోట మాజీ సర్పంచు, టీడీపీ నేత కొణతం బాలయ్య(75) భౌతిక కాయానికి పలువురు నేతలు నివాళులర్పించారు. శుక్రవారం ఆయన స్వగ్రామమైన పూలతోటలో అంత్యక్రియలు జరిగాయి. మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి తదితరులు బాలయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన కుమారుడు కొణతం కిషోర్‌ను, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఐ

పోలీసులకు సత్కారం

పెళ్లకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రామసుబ్బమ్మను శుక్రవారం ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఎస్‌ఐ రామయ్య, రైటర్ తిరుపతయ్య, కానిస్టేబుళ్లు సురేష్, సిరాజ్, కవిత తదిత రులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని, పరీక్షలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రి యాజమాన్యాలను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ చట్ట అమలుపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ లింగనిర్ధారణ చేస్తున్నట్లు కొన్ని స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్‌పై ఫిర్యాదులు వస్తున్నాయని, తనిఖీలు నిర్వహించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఐవో శాంత కుమారి, ఎన్జీవో ప్రతినిధులు కేవీ రమణ, గుర్రప్ప పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శుక్రవారం ఉత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వేదోక్తంగా ప్రదోష నందిసేవ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రదోష నందిసేవ వేదోక్తంగా జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకపూజల అనంతరం ప్రదోష నందిపై స్వామిఅమ్మవార్లను అధిష్ఠింపజేశారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ప్రాకారోత్సవం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





వెంకటగిరిలో కూటమి నేతలు - సూళ్లూరుపేటలో జేవీవీ, యూటీఎఫ్ నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

ఉగ్రవాదుల దాడి అమానుష చర్య

వెంకటగిరి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేయడం అమానుషం అని కూటమి నేతలు ఖండించారు. శుక్రవారం ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ పట్టణంలోని త్రిభువని సెంటరు నుంచి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ కొంతసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో సీఐ రమణ, కూటమి నేతలు పులికొల్లు రాజేశ్వరరావు, శ్రీరాందాస్ గంగాధర్, పనుగోటి విశ్వనాథ నాయుడు, జంపాల ప్రకాష్, రామారావు, శ్రీను, మల్లారం బాబు, నరసింహులు, చిరంజీవి, చంగారావు, జానపాటి మురళి, సామల చలపతి, వెంకటముని, బాషా పాల్గొన్నారు.

గూడూరు: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ జనసేన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక కోర్టు సెంటర్ వద్ద జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మోహన్, బాస్కర్, విజయ్, నాగార్జున, సాయి కిరణ్, సనత్, నవీన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ జన విజ్ఞానవేదిక, యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సూళ్లూరుపేటలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం ముందు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేవీవీ నేత రామ్మూర్తి, యూటీఎఫ్ సీపీఎం నాయకులు చంద్రశేఖర్, అల్లెయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: కశ్మీరులోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ నాయుడుపేట పట్టణంలోని జామియా మసీదు ఎదుట శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రాంతం, మతంతో సంబంధం లేకుండా ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలిలని డిమాండు చేశారు.





గూడూరులో జనసేన నాయకులు - నాయుడుపేటలో ముస్లింల నిరసన

యువతకు ఉపాధి కల్పన ప్రభుత్వ లక్ష్యం



నియామకపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

సత్యవేడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చదువు కున్న యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా ప్రతి నియోజక వర్గం లో మెగాజాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీదాస్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ పరందామ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శ్రీసిటీలో స్థానిక యువతకు ఉపాధి లభించేలా పరిశ్రమ ప్రతినిధులు చొరవ చూపాలని ఆయన కోరారు. కాగా శ్రీసిటీ, చెన్నై, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 17 పరిశ్రమల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా 239 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఇందులో 109 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు స్థానిక స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ చైతన్య చక్రవర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, ఎంపీడీవో చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్, ఎంఈవో రవి, ఎంపీటీసీ సభ్యుడు బీటీఎస్ రెడ్డి, నాయకులు పరమశివం, లోకయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత: ఎస్టీయూ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఇన్‌చార్జి ఆది నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తిరుపతి జిల్లాశాఖ ప్రథమ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులు ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయ వాణి సంపాదకుడు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ... ప్రాథమిక విద్యావ్యవస్థ పటిష్ఠంగా ఉండాలంటే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను కొనసాగించాలని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను తొలగించమంటే 1, 2 తరగతులను నేడు విలీనం చేస్తున్నారన్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రమేష్‌బాబు, జగన్నాథం, కఠారి మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గురుప్రసాద్, యువశ్రీ మురళి, రేణుకాదేవి, శారదమ్మ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా మణి



వైద్యాధికారులను సత్కరిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా మణి బాధ్యతలు స్వీకరించారు. సుమారు రెండు సంవత్సరాల పాటు సీనియర్ గైనకాలజిస్టు విజయలక్ష్మి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. తాజాగా డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగం రాష్ట్ర ఉన్నతాధికారులు రాష్ట్రవ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో వైద్యాధికారుల మార్పులు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సీనియర్ కంటి వైద్య నిపుణులుగా పని చేస్తున్న మణిని సూపరింటెండెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన విజయలక్ష్మిని రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంవో)గా నియమించారు. ఆయా బాధ్యతలను స్వీకరించిన ఇద్దరు వైద్యాధికారులను శుక్రవారం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సత్కరించారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తమామలు, ఆడపడుచు, ఆమె భర్త వేధింపులతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో భర్త, అత్తమామలను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ విశ్వనాధనాయుడు తెలిపారు. మండలంలోని అరిగిలకండ్రిగ అరుంధతివాడకు చెందిన పల్లవి(19), తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం అరుంధతవాడకు చెందిన మాతయ్య అలియాస్ చరణ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొద్ది రోజుల తరువాత వివాహేతర సంబంధం పెట్టుకున్నావంటూ పల్లవిని భర్త చరణ్, మామ కృష్ణయ్య, అత్త నాగరాజమ్మ, ఆడపడుచు గౌరి, ఆమె భర్త కుమార్ వేధించారు. ఈ వేధింపులు తాళలేక గత నెల మార్చి 27న పల్లవి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ.. చరణ్, కృష్ణయ్య, నాగరాజమ్మను శుక్రవారం చల్లమాంబపురం బస్టాండ్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గౌరి, కుమార్ పరారీలో ఉన్నారని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

ఘనంగా వినుత జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రైవేటు కల్యాణ మండపంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పలువురు ఆమెను ఘనంగా సత్కరించారు. పేదలకు అన్నదానం చేశారు. శివకుమార్, గణేష్, చంద్రశేఖర్, చిరంజీవి, లక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

టెన్త్ ఫలితాల్లో బాలికల గురుకులం ప్రతిభ



పుత్తూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల కృష్ణాపురం ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో 96 శాతం సాధించింది. పరీక్షలు రాసిన 73 మందిలో 70మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రహర్షిణి 536 మార్కులు, నర్మద 525, లోహిత 523 మార్కులు సాధించారు. కాగా ప్రథమ శేణిలో 59 మంది, ద్వితీయ శ్రేణిలో 9 మంది, తృతీయ శ్రేణిలో ఇద్దరు ఉత్తీర్ణుల య్యారు. ఈ ఘనత సాధించిన ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి అభినందించారు. పక్కా ప్రణాళికతో సిలబస్ పూర్తి చేయడమే కాకుండా పునశ్చ రణతో ఈ ఫలితాలు వెలువడ్డాయన్నారు. గత ఏడాది నవంబరు నెలాఖరుకు బోధనను పూర్తి చేసి ప్రతి రోజు ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు పఠనం, ఆ తర్వాత పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. వెనుక బడిన విద్యార్థులను ఎంపిక చేసి వారిని ఉపాధ్యాయులకు దత్తత ఇచ్చామన్నారు. గురుకుల పాఠశాల కావడంతో ఉపాధ్యాయులు కూడా పాఠశాలలోనే ఉండి సమష్టిగా కృషి చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

వడమాలపేట,ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):దోమల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ఆరోగ్య సిబ్బంది వడమాలపేటలో ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినం సందర్భంగా శుక్రవారం ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు సాయంత్రం సమయాల్లో వేపాకు పొగ వేయాలని సూచించారు. వైద్యాధికారులు చక్రపాణి, హర్షవర్ధన్, సీహెచ్‌ఓ పురుషోత్తంరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రమోహన్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వాకింగ్ స్టిక్స్, లంబార్ బెల్ట్, నెక్ బెల్ట్, వాకర్, వీల్‌చైర్లను అర్హులకు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పుత్తూరు టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపాలెంలో అఖిల భారత క్షత్రియ మహాసభ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి వాసన్ ఐ కేర్ సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించి 50 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అలాగే బీపీ, షుగర్, ఈసీజీ, జనరల్ చెకప్ చేసి, మందులు ఇచ్చారు. అలాగే విజయ డెంటల్ మల్టీ వైద్యశాల ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రాజు, కోనేటి రవిరాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ శిబిరానికి స్పందన

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కస్టమర్ సర్వీస్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. డీఈ ఎం.ఎస్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్యలతో పాటు నెట్ కనెక్షన్ సమస్యలపై ఫిర్యాదులు ఎక్కువగా అందాయని తెలిపారు. కార్వేటినగరం రోడ్డులోని కార్యాలయం వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

1నుంచి ఉచిత యోగా శిక్షణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమం ఎదురుగా ఉన్న యోగా సెంటర్‌లో మే 1 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. యోగా గురువు మార్కండేయులు ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ముక్కంటి ఆలయ భద్రత మరింత పటిష్ఠం



ఆలయ భద్రతా సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ భద్రతను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి అన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలతో శుక్రవారం ఆలయంలోని ఎస్పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులు, సెక్యూరిటీ సిబ్బందికి సీఐ పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్ము కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. ఎలాంటి బ్యాగులు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఆలయం లోపలకు తీసుకెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఎస్పీఎఫ్ హెడ్ ఇన్‌చార్జి చంద్రమోహన్‌రెడ్డి, సీఎస్‌వో రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో అత్యాధునిక వసతులు



ప్రభుత్వాస్పత్రి వార్డుల్లో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఐసీయూ బెడ్లు - పరికరాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో అత్యాధునిక వసతుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని గతంలో టీడీపీ ప్రభుత్వం ఎంతగానో అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో ప్రభుత్వాస్పత్రిని నెలకొల్పడంతో పాటు ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తూ వచ్చారు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో సదరం శిబిరం, ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత యేడాది ఎన్నికల సందర్భంగా బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రభుత్వాస్పత్రిని వైసీపీ పాలకులు నిర్లక్ష్యం చేశారని తాము అధికారంలోకి వస్తే తిరిగి అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం పది రోజుల క్రితం సీఎస్ఆర్ ఫండ్స్ కింద సెంట్రల్ ఆర్వో సిస్టంను మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి రోజున ప్రారంభించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో అన్ని వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో రోగులు హర్షం వ్యక్తం చేశారు. తాజాగా శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్ సూచనలతో ఆస్పత్రికి 20 ఐసీయూ బెడ్లు, బెడ్ సైడ్ లాకర్స్, రోగులు భోజనం చేసేందుకు సైడ్ ట్రాలీలు ఆస్పత్రికి చేరాయి. తొలివిడతగా వచ్చిన ఈ పరికరాలను సూపరింటెండెంట్ మణి, ఆర్ఎంవో విజయలక్ష్మి ఆస్పత్రిలోని పలు వార్డుల్లో అమర్చి రోగులకు అందుబాటులోకి తెచ్చారు. దీనిపై రోగులు హర్షం వ్యక్తం చేశారు.

నాయీ బ్రాహ్మణులకు భరోసా కల్పించిన సీఎం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయీబ్రాహ్మణులకు సీఎం చంద్రబాబు భరోసా కల్పించారని తిరుపతి పార్లమెంటు టీడీపీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి సోషల్‌మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం నాయీబ్రాహ్మణులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబుప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. అందులోభాగంగానే దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు కనీస వేతనం రూ.20వేలు నుంచి రూ.25వేలకు పెంచుతూ పెంచుతూ జీవో తీసుకురావడం హర్షణీయమన్నారు. అటు అభివృద్ధి కార్యక్రమాలు, ఇటు బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. నాయీ బ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు కృష్ణమూర్తి, రమేష్‌బాబు, యుగంధర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు - మానవహారంలో జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పెద్దమసీదు వీధిలో నమాజ్ అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. భారతదేశంలో హిందువులు, ముస్లింలు ఐకమత్యంగా జీవిస్తున్నారని ఇలాంటి ఘటనల వల్ల మతవిద్వేషాలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ముత్తవల్లీ అక్రం, అంజాద్‌బాషా, ప్రభుత్వ ఖాజీ మున్నా, షాకీరాలీ, ఖలీల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

● పహల్గాం ఘటనను నిరసిస్తూ జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని భేరివారి మండపం వద్ద ఆ పార్టీ నాయకులు మానవహారం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత, పేట చంద్రశేఖర్, తోట గణేష్, నాగరాజు, భాగ్యలక్ష్మి, మధుశేఖర్, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి గాంధీ విగ్రహం వద్ద ఉగ్రదాడిని నిరసిస్తూ కూటమి నాయకులు మానవహారం చేపట్టి మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పృథ్వీ మాట్లాడుతూ ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు రూపేష్, బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మునికృష్ణయ్య, నాయకులు చిరెన్ చిన్న, మోహన్‌బాబు, మణి, దిలీప్, సుబ్రమణ్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీపై డీఎల్పీవో విచారణ

రేణిగుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూకివాకం పంచాయతీ సంజీవరాయపట్టిలో సర్వే నెం.12, 13లో యజమానికి కాకుండా వేరొకరికి ఎన్వోసీ జారీ చేయడంపై డీఎల్పీవో సంబంధిత ఈవోపీఆర్డీ ప్రభురావుపై విచారణ జరిపారు. తన భూమికి సంబంధించి శంకరమ్మ అనే మహిళకు ప్లాట్ అప్రూవల్, ఇంటి పన్ను, విద్యుత్ సర్వీసుకు ఎన్వోసీ జారీ అయినట్లు యజమాని కుమార్ ఆచారి జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాల్సిందిగా డీఎల్పీఓకు పంచాయతీ అధికారి ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాళహస్తి డీఎల్పీవో ప్రభు రెడ్డి రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో ఇరువర్గాల రికార్డులను, డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఇల్లు నిర్మించిన ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి మణి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది శుక్రవారం దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ అనాఫిలిస్ దోమ కుడితే మలేరియా వస్తుందన్నారు. రోజు విడిచి చలితో జ్వరం వస్తుందన్నారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి చరిత్ర ఆధ్వర్యంలో సిబ్బంది, ఆశ వర్కర్లు ఆర్టీసీ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయుష్ వైద్యాధికారి ధనంజయులు, సామాజిక ఆరోగ్య అధికారి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు పూర్తి

రేణిగుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంగారెడ్డిపల్లి, ఆర్ అగ్రహారం నడుమ రైల్వే వంతెన కింద కొన్నేళ్ల క్రితం విద్యుత్ లైన్ మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి దీన్ని పట్టించుకోకుండా వదిలేయడంతో కరకంబాడి సబ్‌స్టేషన్ పరిధిలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం, లోవోల్టేజీ సమస్యలు తలెత్తేవి. దీన్ని గుర్తించి డీఈ రమేష్ బాబు ఆదేశాలతో మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. అర్బన్ ఏఈ పుణ్యకోటి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతు భూ పరీక్షలు చేయించాలి



మట్టి సేకరించడాన్ని వివరిస్తున్న సిబ్బంది

రేణిగుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు భూ పరీక్ష చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ సూచించారు. మండలంలోని ఎల్లమండ్యంలో భూ పరీక్షల కోసం మట్టిని సేకరించే విధానాన్ని రైతులకు తెలియజేశారు. భూ పరీక్షల ఆధారంగా సాగు చేస్తే ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. ఏవో సునీల్ కుమార్, రైతు సేవా కేంద్రం అధికారి లోకేష్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య ముళ్ల పొదలకు నిప్పు

రేణిగుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య ముళ్ల పొదలకు నిప్పు అంటుకోవడంతో స్థానికులు బిందెలతో మంటలను ఆర్పారు. శుక్రవారం మధ్యాహ్నం భగత్‌సింగ్ కాలనీ సమీపంలోని ఇళ్ల మధ్యలో ఉన్న ముళ్లపొదల్లో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. సమీపంలో ఇంటి నిర్మాణం జరుగుతుండడం, అక్కడి కూలీలు బిందెలతో నీటిని తీసుకొచ్చి మంటలను అదుపు చేశారు.

మా ఊరిలోనే పాఠశాల కొనసాగించండి



డీవైఈఓకు వినతిపత్రం అందిస్తున్న వెలుతురు కండ్రిగవాసులు

నారాయణవనం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెలుతురు కండ్రిగ గ్రామస్తులు తమ ఊరిలో ఉన్న పాఠశాలను మరో పాఠశాలలో విలీనం చేయొద్దని డీవైఈవో ప్రభాకర్‌రాజుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వెలుతురు కండ్రిగలోని ప్రైమరీ పాఠశాలను 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుంబూరు పాఠశాలలో విలీనం చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. వెలుతురు కండ్రిగ నుంచి 17 మంది విద్యార్థులు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుంబూరు పాఠశాలకు వెళ్లలేరని, ప్రాథమిక పాఠశాలను అలాగే కొనసాగించాలని వారు కోరారు.

30న పాలిసెట్

సత్యవేడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30వ తేదీన సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పాలిసెట్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి తెలిపారు. ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో తమ హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉండదని తెలిపారు.